క్లుప్తంగా

నేడు ఆలయ నిర్మాణానికి భూమిపూజ

బంట్వారం: కోట్‌పల్లి మండల కేంద్రం శివారులోని ఓ వెంచర్‌లో అయ్యప్ప దేవాలయం నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేయడం జరుగుతుందని అయ్యప్ప సేవా సమితి సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పలువురు వెంచర్ ఓనర్లు దేవాలయం నిర్మాణం కోసం స్థలాన్ని ఉచితంగా కేటాయించారన్నారు. ఆలయ భూమి పూజా కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అయ్యప్ప సేవా సమితి సభ్యులు కోరారు.

శ్రీవారి సేవకు తరలిన భక్తులు



శ్రీవారిసేవకు బయలుదేరిన భక్తులు

బొంరాస్‌పేట: పేదల వేల్పుగా పేరొందిన తిరుపతిలో శ్రీవారిసేవకు పెద్ద ఎత్తున భక్తులు తరలివెళ్లారు. మండలంలోని రేగడిమైలారానికి చెందిన 32మంది మహిళలు, పురుషులు కలిసి ఆదివారం బయలుదేరారు. ఆర్గనైజర్ చంద్రశేఖర్‌గౌడ్, గ్రూపు లీడర్లు కుమ్మరి వెంకటయ్య, మంగలిరవి, నెల్లిఅంజిలయ్యతో పాటు ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2వరకు సేవలో పాల్గొంటున్నారని చెప్పారు. భక్తులు గోవిందొడ్డి, విశ్వనాథ్, రాములు, నర్సింలు, బస్వరాజ్, శేఖరయ్య, అనంతయ్య పాల్గొన్నారు.

రామశోభాయాత్రకు విరాళం



విరాళం అందజేస్తున్న మారుతికిరణ్

పరిగి: పరిగి పట్టణ కేంద్రంలో సోమవారం నిర్వహించే శ్రీరామ శోభాయాత్రకు బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ ఆదివారం రూ.1.5 లక్షల విరాళం అందజేశారు. ఐదు వందల ఏళ్ల హిందువుల కల నేడు తీరనుందన్నారు. రామ రాజ్యస్థాపనకు బీజేపీ ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ అయోధ్యలో జరిగే శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ రోజు భక్తిభావంతో నిత్యం పూజలు చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని రామభక్తులు శోభాయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాలగుమ్మి పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

పరిగి: పట్టణ కేంద్రంలోని సత్యసాయిబాబా మందిరంలో చిగురాల్‌పల్లి ప్రసాద్ రచించిన 'పాలగుమ్మి అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక' పరిగి విభాగం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. పలువురు కవులు మాట్లాడుతూ.. పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందన్నారు. యువత పుస్తకాలు చదవడంపై ఆసక్తి చూపాలన్నారు. ఎంతో మంది కలువుల ఎన్నో పుస్తకాలను ఆవిష్కరిస్తూ భవితరాలకు జ్ఞానాన్ని అందించేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కవి సంగమం వ్యవస్థాపకులు యాకూబ్, బాగయ్య, నర్సింహులుగుప్తా, భాస్కరయోగి పాల్గొన్నారు.

ధర్మపరిరక్షణకు ముందుకుసాగాలి



స్వచ్ఛత కార్యక్రమంలో ప్రహ్లాదరావు, నేతలు

కుల్కచర్ల: హిందువులందరూ ధర్మపరిరక్షణకు ముందుకు సాగాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాదరావు అన్నారు. అయోధ్య భవ్యరామ మందిరం రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోదీ పిలుపుమేరకు స్వచ్ఛ తీర్థ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని అంజనేయస్వామి దేవాలయం, శివాలయాన్ని శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత సనాతన ధర్మాన్ని కాపాడుకుంటూ సంస్కృతి, సంప్రదాయాలు, ధర్మపరిరక్షణ వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. మన ఆలయాలను మనమే శుభ్రంగా ఉంచుకునేందుకు యువత ముందుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అంజనేయులు, మండల పార్టీ అధ్యక్షుడు మైపాల్, దళిత మోర్చా జిల్లా కార్యదర్శి సంగెం శ్రీను, మైపాల్, కర్ణయ్య, రాములు, అంజనేయులు పాల్గొన్నారు.

అంతా రామమయం



తాండూరు: రామస్వామి దేవాలయానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులు



వికారాబాద్ అర్బన్:పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

తాండూరు: రామ నామస్మరణతో తాండూరు ప్రాంతం మార్మోగుతోంది. అయోధ్య నగరంలో రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో తాండూరు పట్టణం నుంచి యాలాల మండలం జుంటిపల్లి అటవీ ప్రాంతంలో వెలసిన రామచంద్రస్వామి దేవాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వినాయక దేవాలయం నుంచి పాదయాత్రను ప్రారంభించారు. ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులతో పాటు పెద్ద ఎత్తున భక్తులు చేరుకొని రామస్వామి దేవాలయానికి బయలు దేరారు. సోమవారం జుంటిపల్లి రామచంద్రస్వామి దేవాలయంలో జరిగే రాములవారి ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మరోవైపు పట్టణంలోని గోశాల సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే సీతారాముల కల్యాణ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

కల.. సాకారమవుతున్న వేళ

దోమ : వందల ఏళ్లుగా ఎదురుచూసిన తరుణం. ప్రపంచానికి ఉత్తమ సమాజ నిర్మాణం, ఆదర్శ జీవన విధానానికి స్ఫూర్తి .. యుగపురుషుడు శ్రీరామచంద్రుడి భవ్య మందిరం అయోధ్యలో నేడు(సోమవారం) ప్రారంభం కావడం హర్షించదగ్గ విషయమని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పాలేపల్లి, బొంపల్లి, శివారెడ్డిపల్లి, దాదాపూర్, బడేంపల్లి, కొండాయపల్లి, దిర్సంపల్లి, మల్లేపల్లి, కొత్తపల్లి, దాదాపూర్ గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు గ్రామంలో ఉండే దేవాలయాలను శుభ్రం చేసి పూవ్వులతో అందంగా అలంకరించారు. విధుల్లో కాషాయ జెండాలను కట్టి గ్రామాలను అందంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అయోధ్యలో బాల రాముడి ప్రతిష్ఠాపన హిందువులకు గర్వకారణమని అన్నారు. గ్రామాల్లో అయోధ్య నుంచి వచ్చిన అక్షితలను ఇప్పటికే ఇంటింటికి పంపిణీ చేశామన్నారు. భక్తిశ్రద్ధలతో వాకిళ్లను శుభ్రం చేసుకుని శ్రీరాముడికి దీపాలను వెలగించి పూజలు చేయాలని సూచించామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల శ్రీరామ భక్తులు పాల్గొన్నారు.

పట్టణంలో భారీ బైక్ ర్యాలీ

వికారాబాద్ అర్బన్: అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్, బీజేవైఎం ఆధ్వర్యంలో పట్టణంలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ఆలంపల్లి వరకు రామనామంతో మార్మోగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి మాట్లాడుతూ.. గత 500 ఏళ్లుగా సాధ్యం కాని అయోధ్య రామమందిర నిర్మాణం మోడీ హయాంలో సాధ్యమైందన్నారు. రామమందిర నిర్మాణం దేశంలోని ప్రతి ఒక్కరిలో దేశభక్తి, జాతీయ భావం పెంచిందన్నారు. నేడు రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయా దేవాలయాల్లో జరుగుతున్న కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని సూచించారు. సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జుంటుపల్లి ఆలయం వరకు పాదయాత్ర

యాలాల: అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆదివారం టీపీయూఎస్ సంఘం ఆధ్వర్యంలో తాండూరు నుంచి జుంటుపల్లి రామస్వామి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. తాండూరు నుంచి లక్ష్మీనారాయణపూర్, చెన్నారం, అక్కంపల్లి మీదుగా జుంటుపల్లి రామస్వామి ఆలయం వరకు పాదయాత్రగా చేరుకున్నారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. పాదయాత్ర చేసిన టీపీయూఎస్ ఉపాధ్యాయులకు మార్గమధ్యంలో ఫలహారం, నీటిని చెన్నారం అనిల్‌కుమార్, వేణుగోపాల్‌లు అందజేశారు. పాదయాత్ర చేసిన వారిలో టీపీయూఎస్ సంఘ బాధ్యులు డి.రాములు, ఆనందం, సంగమేశ్వర్, శ్రీనివాస్, గాజుల వీరేశం, క్రిష్ణకుమార్, సంగీత, బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మణచారి తదితరులు ఉన్నారు.

రాములోరి అక్షితల పంపిణీ

కుల్కచర్ల: అయోధ్య రామమందిర స్పర్శ అక్షితలను ఆదివారం కుల్కచర్ల మండలం చెల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటింటికీ పంపిణీ చేశారు. హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పరిధిలోని వీధుల్లో ర్యాలీగా వెళ్లి ఇంటింటికీ రాములవారి అక్షితలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్వతపురం అంజనేయులు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండా అంజనేయులు, కృష్ణయ్య, శ్రీను, వెంకటేశ్ పాల్గొన్నారు.



పాలేపల్లిలో హనుమాన్ దేవాలయాన్ని అలంకరిస్తున్న గ్రామస్తులు



దోమ: కాషాయ జెండాలను కడుతున్న నాయకులు



కుల్కచర్ల: అక్షితలు పంపిణీ చేస్తున్న హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు

ఓటరుగా నమోదు చేసుకోవాలి



బంట్వారం: దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

- తహసీల్దార్లు ప్రవీణ్ కుమార్, ఆశాజ్యోతి

బంట్వారం: 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు కొత్తగా ఓటరు లిస్టులో పేర్లు నమోదు చేసుకోవాలని బంట్వారం, కోట్‌పల్లి తహసీల్దార్లు ప్రవీణ్‌కుమార్, ఆశాజ్యోతి పేర్కొన్నారు. ఓటరు నమోదు స్పెషల్ క్యాంపెయినింగ్‌లో భాగంగా ఆదివారం వారు బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లో పర్యటించి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, బుత్ లెవల్ అధికారులు ఓటరు నమోదుపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల చివరి వరకు ఆన్‌లైన్‌లో ఓటరు నమోదుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు పొందాలి

కొడంగల్ : మండల పరిధిలో 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ సూచించారు. ఆదివారం మండల పరిధిలోని చిట్లపల్లి, అన్నారం, నాగారం, రుద్రారం, టేకుల్‌కోడ్, అంగడిరాయిచూర్ గ్రామాలతో పాటు కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటరు సవరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు చేసుకునేందుకు ఓటర్లకు అవకాశం కల్పించారు. ఓటర్లకు సంబంధించి పేరులో తప్పులు, అడ్రస్ మార్పినా ఇతర ఎలాంటి సమస్యలు ఉన్నా సంబంధిత బీఎల్‌ఓలకు ఓటర్లు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిర్యాదులు, దరఖాస్తులను పరిశీలించి ఓటరు జాబితాను సవరించనున్నట్లు చెప్పారు.

ఓటు హక్కుకు 599 దరఖాస్తులు


తాండూరు: తాండూరు అసెంబ్లీ పరిధిలో పోలింగ్ బూత్‌ల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఎన్నికల స్పెషల్ డ్రైవ్ శిబిరంలో ఓటు హక్కు కోసం 599 మంది దరఖాస్తులు చేసుకున్నారని ఆదివారం తాండూరు ఆర్డీఓ శ్రీనివాసరావు తెలిపారు. 269 పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు కొత్త ఓటరు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించారన్నారు. 18 ఏళ్ల వయసు నిండిన యువతీ యువకులు ఫారం–6లో 464 దరఖాస్తులు , ఫారం–7లో 48, ఫారం8లో 87 దరఖాస్తులు అందాయన్నారు. దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి ఓటరు గుర్తింపు కార్డులను అందజేస్తామన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బొంరాస్‌పేట: రెండు రోజులుగా బూత్‌స్థాయిలో ఓటరు జాబితాపై ప్రత్యేక క్యాంపెయిన్ బీఎల్‌ఓలు నిర్వహిస్తున్నారు. ఆదివారం తహసీల్దార్ వెంకటేశ్ మండల కేంద్రంతో పాటు వడిచర్ల, ఎన్కేపల్లి, కొత్తూరు, రేగడిమైలారంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాల్లో ఫారం6, 7, 8లతో పాటు ఏఎస్‌డీ (ఆబ్‌సెంట్, షిఫ్టెడ్, డెత్) జాబితాను పరిశీలించారు. కొందరు ఓటు హక్కు చేసుకున్న దరఖాస్తులను తహసీల్దార్ చేతుల మీదుగా అందజేశారు. 25న జాతీయ ఓటరు దినాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు.



టేకుల్‌కోడ్‌లో ఓటర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్



బొంరాస్‌పేట: బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్

వంట గ్యాస్ కష్టాలు

- గ్రామాల్లో పూర్తిగా నిలిచిపోయిన సరఫరా
- స్పందించని అధికారులు, డీలర్లు

వికారాబాద్ అర్బన్: ప్రజలకు వంటగ్యాస్ కష్టాలు తప్పడం లేదు. గత 20 రోజులుగా హెచ్‌పీ గ్యాస్ సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు, డీలర్లు పట్టించుకోవడం లేదు. ఆదివారం పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ గోదాం వద్ద వినియోగదారులు ఖాళీ గ్యాస్ సిలిండర్లను వరుసలో పెట్టి రోజంతా పడిగాపులు కాయాల్సి వచ్చింది. సంబంధిత జిల్లాస్థాయి అధికారులు వంట గ్యాస్ సరఫరా అవుతుందని ఒక ప్రకటన విడుదల చేసి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు మండిపడుతున్నారు. 20 రోజుల క్రితం వరకు గ్రామాల్లో ఇంటింటికి గ్యాస్ సరఫరా చేసేవాళ్లు. ఇటీవలే సరఫరా నిలిపివేశారు. గ్యాస్ ఇబ్బందులు ఈ మధ్యకాలంలోనే ప్రారంభం కావడంతో ప్రభుత్వంపై వ్యతిరేకత వినిపిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ పరిస్థితి నెలకొందని వినియోగదారులు అనుకుంటున్నారు. పైగా ఒకే డీలర్ ఉండటంతో కూడా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ప్రత్యామ్నాయంగా మరో డీలర్‌ను ఏర్పాటు చేసి అందరికి వంట గ్యాస్ అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



గ్యాస్ గోదాం వద్ద ఖాళీ సిలిండర్లను వరుసలో పెట్టిన వినియోగదారులు

రేపు మెగా జాబ్ మేళా



శ్రీకాంత్‌రెడ్డి

దోమ : ఈ నెల 23న (మంగళవారం) ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పరిగి పట్టణంలోని నంబర్ –1 హైస్కూల్‌లో ఉదయం 10 గంటలకు మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నారని ఈ మేళాను గ్రామీణ ప్రాంత యువత సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగాలు కల్పించడంలో గత ప్రభుత్వం విఫలమైందని, దీంతో నిరుద్యోగుల సంఖ్య రాష్ట్రంలో విపరీతంగా పెరిగిందన్నారు. నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమయం లేదు మిత్రమా!

- 31తో ముగియనున్న ఈకేవైసీ గడువు
- మండలంలో ఇంకా పూర్తి కాని వైనం

దౌల్తాబాద్: పేద మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరలకు పలు రకాల నిత్యావసర సరుకులు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా అందజేస్తోంది. దీంతో పూర్తి రాయితీతో రేషన్‌కార్డులో పేరు ఉన్న ప్రతి ఒక్కరికి 6 కిలోల చొప్పున రేషన్‌బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈ బియ్యం పక్కదారి పట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగా రేషన్ కార్డులు ఉన్నవారు ఈకేవైసీ చేసుకోవాలనే ఆదేశాలు జారీ చేయడంతో మండల వ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో వేలిముద్రలు వేసే కార్యక్రమం వడివడిగా సాగుతోంది. ఐదు నెలలుగా సాగుతున్నా.. మండలంలో ఇంకా 15శాతం వరకు ఈకేవైసీ చేసుకోలేదని రెవెన్యూ అధికారులు తెలిపారు. కొన్ని రోజులు మాత్రమే గుడువు ఉండడంతో లబ్ధిదారులు త్వరగా నమోదు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు.



రేషన్ పంపిణీ చేస్తున్న డీలర్ (ఫైల్)

31తో ముగియనున్న గడువు

ఈకేవైసీ నమోదు గడువు ఈనెల 31తో ముగియనుంది. వేలిముద్రలు పడని వృద్ధులు, దివ్యాంగులకు ఐరిష్ ద్వారా నమోదు చేయనున్నారు. కొంతమందికి ఆధార్‌కార్డు ప్రక్షాళన లేకపోవడంతో ఈకేవైసీ నమోదు కావడంలేదు. అయితే దీనిపై సరైన అవగాహన లేకపోవడంతో నమోదుకు కారణంగా చెప్పవచ్చు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి వందశాతం పూర్తయ్యేలా చూడాల్సిన అవసరం ఉంది.

శిథిలావస్థలో పెద్దేముల్ బస్టాండ్

- బస్టాండ్‌లో ఆగని బస్సులు
- తాగుబోతులకు అడ్డాగా మారిన వైనం
- వృథాగా ప్రజాధనం



నిరుపయోగంగా మారిన పెద్దేముల్ ఆర్టీసీ బస్టాండ్

పెద్దేముల్ : పెద్దేముల్ బస్టాండ్ శిథిలావస్థకు చేరి కూలిపోయే స్థితికి చేరింది. ప్రయాణికుల సౌకర్యార్థం అప్పటి ప్రభుత్వం మండల కేంద్రంలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా మారింది. ఇక్కడ ఒక్క బస్సు కూడా ఆగడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో వీధి లైట్లు లేక తాగుబోతులకు అడ్డాగా మారింది. ఈ విషయాన్ని మండల సమావేశంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదని విమర్శిస్తున్నారు. ఆర్టీసీ సిబ్బందిని ఏర్పాటు చేసి బస్సులు నిలపాలని పలు గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు వాపోతున్నారు. కనీసం బస్సులు ఆగితే ప్రయాణికులు, విద్యార్థులు వచ్చే ఆస్కారం ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. దాదాపు 20 ఏళ్ల క్రితం పెద్దేముల్ మండల కేంద్రంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం సుమారు రూ.5లక్షల వ్యయంతో బస్టాండ్‌ను నిర్మించింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, మాజీ రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో బస్టాండ్ అభివృద్ధికి సీసీ రోడ్లు, ప్రహరీ నిర్మాణానికి సుమారు రూ.15లక్షలకు పైగా నిధులు మంజూరు చేశారు. పనులు పూర్తయిన వెంటనే బస్సులు నిలపాలని ఆదేశించారు. మండల సర్వసభ్య సమావేశంలో పలు గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో బస్సులు నిలపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.

ప్రజాప్రతినిధుల ఆదేశాలు బేఖాతరు..

ఏళ్లు గడుస్తున్నా ఒక్క బస్సు ఆగితే ఒట్టు. రోజురోజుకు శిథిలావస్థకు చేరుతుంది. ముళ్లపొదలతో ఆవరణం నిండిపోయింది. కనీసం కంప చెట్లను తొలగించే నాథుడే లేరు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. బస్టాండ్ ప్రభుత్వ కార్యాలయాలకు దగ్గరలో ఉన్నా బస్సులు ఆగడం లేదు. కళాశాల, పాఠశాలల విద్యార్థులు అక్కడికి వచ్చిన సమయాల్లో బస్సులు నిలపకపోవడంతో విద్యార్థులు కూడా రావడం లేదు. ప్రతి నిత్యం సంగారెడ్డి, వికారాబాద్, నాగులపల్లి, జహీరాబాద్, కోటపల్లి, కోహీర్ ప్రాంతాలతో పాటు పలు గ్రామాలకు నిత్యం వందల బస్సులు నడుస్తున్నాయి. కానీ, ఒక్క బస్సు కూడా బస్టాండ్‌లోకి రావడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్సులు వచ్చేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై తాండూరు డీఎం సమతను వివరణ కోరగా ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. తప్పకుండా బస్సులు ఆపేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



పెచ్చులూడుతున్న పైకప్పు

వినియోగంలోకి తేవాలి



మండల కేంద్రంలోని బస్టాండ్ నిరుపయోగంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి ఉపయోగంలోకి తీసుకురావాలి. దీంతో విద్యార్థులు, ఆయా గ్రామాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. బస్సుల రాకపోకలు కొనసాగితే ప్రయాణికులు కూడా వస్తారు. గతంలో నెల రోజులు బస్సులు వచ్చి, తరువాత పూర్తిగా నిలిచిపోయాయి.

– శ్రీనివాస్‌రెడ్డి మాజీ సర్పంచ్ పెద్దేముల్

సిబ్బందిని ఏర్పాటు చేయాలి



బస్టాండ్ నిర్మించినప్పటి నుంచి బస్సులు సక్రమంగా రావడం లేదు. ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి రవాణా శాఖ మంత్రిగా ఉన్న సమయంలో బస్సులు వచ్చేవి. సుమారు ఐదేళ్ల నుంచి ఒక్క బస్సు కూడా రావటం లేదు. దీంతో బస్టాండ్ రోజు రోజుకు శిథిలావస్థకు చేరుకుంటుంది. ఇప్పటికే బస్టాండ్ పైకప్పు పెచ్చులు ఊడిపోతుంది.

– సందీప్‌కుమార్ బీజేపీ మండల అధ్యక్షుడు, మంబాపూర్

విద్యార్థులను చూసి బస్సులు ఆపండి



బస్టాండ్ చుట్టూ ప్రభుత్వ కార్యాలయాలు, జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. గతంలో విద్యార్థుల కోసం బస్సులు వచ్చేవి. ప్రస్తుతం రావడం లేదు.. ఎవరూ పట్టించుకోక పోవడంతో బస్టాండ్ పూర్తిగా శిథిలావస్థకు చేరుతుంది. దీంతో ప్రయాణికులు విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం. తప్పకుండా బస్సులు ఆగేలా చర్యలులు తీసుకుంటాం.

– లోంక నర్సింలు, మాజీ సర్పంచ్, హన్మాపూర్